

నేడు చిత్తూరుకు మంత్రి రాక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 15వ తేదీ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్యాశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి 15వ తేదీ చిత్తూరు పట్టణానికి విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు పర్యటనలో భాగంగా మంత్రి ఈనెల 15న ఉదయం 7.30 గంటలకు చిత్తూరు చేరుకుంటారని, అనంతరం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. తదుపరి మధ్యాహ్నం 1.30 గంటకు తిరుపతి బయలుదేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో

భద్రతపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆగష్టు 9న పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జి కేర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, సెమినార్ రూమ్‌లో 31 ఏళ్ల ట్రైనీ డాక్టర్ అమానవీయంగా మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందనీ ఈ హృదయ విషాద ఘటనను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ట్రైనీ డాక్టర్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో భద్రత గాలిలో దీపంలా ఉందన్న విషయం తేటతెల్లం చేస్తోందన్నారు. ప్రాణాలను రక్షించే ఓ వైద్యురాలికే రక్షణ లేదంటే మరి సామాన్య ప్రజల పరిస్థితేంటని ఆందోళన వ్యక్తం చేశారు. యువ డాక్టర్‌పై దారుణంగా అత్యాచారం చేయడంతోపాటు ఆమెను హత్య చేసిన తీరు యావత్ భారతదేశాన్ని కదిలించిందన్నారు.


వైద్య విద్యార్థి హత్యను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



చిత్తూరు అర్బన్: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జి కేర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ డ్యూటీలో ఉన్న పీజీ వైద్య విద్యార్థి హత్యకు నిరసనగా బుధవారం అపోలో మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. వుయ్ వాంట్ జస్టిస్ అంటూ అపోలో మెడికల్ కళాశాల నుంచి ముర్కంపట్టు పరిసర ప్రాంతాలలో కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. మెడికల్ విద్యార్థిని విద్యార్థులు అపోలో వైద్య కళాశాల సిఓఓ నరేష్ కుమార్ రెడ్డి, డీన్ డాక్టర్ ఆల్ఫ్రెడ్ జె అగస్టిన్, డాక్టర్ రమ్య, డాక్టర్ శ్రావణదీప్తి , డిఆర్.రవికాంత్ వైద్యవిద్యార్థులు, పీజీ డాక్టర్లు, పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించిలని, అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో మీటర్ రీడర్లు ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు.గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అనేక దఫాలుగా కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. మీటర్ రీడర్ల శ్రమను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారన్నారు. ఐదు సంవత్సరాల క్రితం పీస్ రేటు ఒక సర్వీసుకు రూ.3.80 ఉండేదని, తమకు వేతనం పెంచక పోగా రూ.3.60 కి తగ్గించారన్నారు. కొత్తగా ఇచ్చిన టెండర్లలోనూ అదే పీస్‌రేట్ ఇచ్చారన్నారు.పీస్‌రేట్‌ను రూ.8కి పెంచాలన్నారు.20 తేదీలోపు సమస్య పరిష్కరించకపోతే కార్పొరేట్ కార్యాలయం మొదట మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ పాల్గొన్నారు.



శెట్టిపల్లి సమస్య పరిష్కరించేలా చూడాలని మాజీ ఎంపి పి.మధుకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

త్వరలోనే సిఎం దృష్టికి శెట్టిపల్లి సమస్య

'సదస్సు'లో మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శెట్టిపల్లి భూబాధితుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, అవసరమైతే సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, రెవెన్యూ మంత్రి ఎ.శ్రీనివాసులును కలుస్తానని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు అన్నారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో 'శెట్టిపల్లి ఇళ్లస్థలాల పోరాట కమిటీ' ఆధ్వర్యంలో సదసుస జరిగింది. ఈ సందర్భంగా పి.మధు మాట్లాడుతూ 34 ఏళ్లుగా పోరాటం చేస్తున్న శెట్టిపల్లి భూబాధితుల సమస్యను టిడిపి, వైసిపి పార్టీలు పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. సిపిఎం పోరాటాల ఫలితంగా రెవెన్యూ అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారని, స్థలాలు చూపడమే తరువాయి అన్నారు. ఎన్నికలై రెండు నెలలు దాటినా శెట్టిపల్లి సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం అవుతుందని, న్యాయం చేస్తారని మూడువేల మంది బాధితులు ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. జనసేన ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు స్పందించి శెట్టిపల్లి భూబాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమస్య పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వేణు, శెట్టిపల్లి ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ రాధాకష్ణ, ఎండి శ్రీను, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు అజ్ఞానం వల్ల కాదు..

అవగాహన లోపమే : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలోని గాంధీ కూడలి వద్ద సుమారు 600 మంది కాలేజీ విద్యార్థులో బుధవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో స్థానిక పోలీసు అధికారుల సమక్షంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన వాక్‌థాన్ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా జరిగింది. విద్యార్థులతో సైబర్ నేరాలు పట్ల జాగ్రత్తలు, మాదకద్రవ్యాల వాడకాల పరిణామాల గురించి నినాదాలు పలికించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ వాకతాన్‌లో పాల్గొన్నారు. మొత్తం 5 కిలోమీటర్ల పొడవునా వాకథాన్ కొనసాగింది. ఎస్పీ మాట్లాడుతూ ఈ వాక్‌థాన్ ద్వారా చిత్తూరు జిల్లాలో సైబర్ నేరాల వలన పెరుగుతున్న ముప్పు, మాదకద్రవ్యాల ప్రభావం వంటి సమకాలీన సమస్యలపై అవగాహన కల్పించడం ముఖ్య లక్ష్యమన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకి పెరుగుతున్నాయని, మన వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోకుండా ఉంటే, సైబర్ నేరగాళ్లు దాన్ని దోచుకోవడానికి సిద్ధంగా ఉంటారని అన్నారు. ఇంటర్నెట్‌లో ఒక చిన్న తప్పు మన జీవితాన్నే అంధకారంలోకి నెట్టవచ్చు అని అందువల్ల, ప్రతి ఇంటర్నెట్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇతర క్రైమ్‌లతో పోలిస్తే సైబర్ క్రైమ్ నేరాలు ప్రతి ఏటా 12 శాతం పెరుగుతున్నాయని, ఇంకా చాలా సైబర్ నేరాలు పోలీసు స్టేషన్‌లో నమోదు కావడం లేదన్నారు. సైబర్ క్రైమ్ ద్వారా ఎక్కువ నగదు పోగొట్టుకున్నప్పుడే కేసు నమోదు చేస్తున్నారని తెలిపారు. ఈ మధ్య కాలంలో పలమనేరులో డాయ్ యాప్ పేరుతో జరిగిన ఒక సైబర్ క్రైమ్ లో ప్రజలు సుమారు 6 కోట్ల మేర డబ్బును పోగొట్టుకున్న విషయం గురించి వివరిస్తూ సైబర్ నేరగాళ్లు ఎలా మాయ చేస్తారో వివరించారు. మాదాకద్రవ్యాల వినియోగం వలన విద్యార్థుల జ్ఞాపకశక్తి నశించిపోతుందని, శారీరక రుగాత్మకలు కలిగి చిన్న వయసులో అనేక రకాలైన వ్యాధులకు గురి అవుతారని, విద్యార్థిని విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని అన్నారు. మీ చుట్టుపక్కల వారు ఎవరైనా మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వారిని రిహాబిటేషన్ సెంటర్‌కు తరలించే కార్యక్రమంలో సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. సైబర్ క్రైమ్‌పై ఫిర్యాదు చేయడానికి, మీ కాలేజీస్ లేదా స్కూల్స్ సమీపంలో మాదకద్రవ్యాల అమ్మకాలు జరిగితే వెంటనే డయల్ 100కు గాని సైబర్ క్రైమ్ కంప్లైంట్ నెంబర్ 1930కు, మాదాకద్రవ్యాల కంప్లైంట్ ప్రత్యేక నెంబర్ 14500కు, చిత్తూరు జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 94409 00005కు వెంటనే సమాచారాన్ని అందించి మాదకద్రవ్యాల వినియోగం పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసు వారికి సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ తెలియజేశారు.



సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీలో జిల్లా ఎస్పీ

పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ


స్వాతంత్ర దినోత్సవ వేడుకల రిహార్సల్స్ పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ పెరేడ్ మైదానంలో ఆగస్టు 15 న ఘనంగా నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్‌ను ఎస్పీ ు మణికంఠ చందోలు పరిశీలించారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వేళ చిత్తూరు డిటిసి పెరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా స్వాతంత్ర వేడుకలు నిర్వహించడానికి బుధవారం చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది డిటిసి పెరేడ్ గ్రౌండ్స్‌లో పెరేడ్ రిహార్సిల్స్ నిర్వహించారు. ఆర్ఐ సుధాకర్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. ఎస్పీ జాతీయ పతాకం ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించి పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజు మరింత ఉత్సాహంగా కవాతు ప్రదర్శన చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ రోజున జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, తదితర వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు కల్పించాల్సిన భద్రత, సౌకర్యాలను సమీక్షించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిపుల్లా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్ బాష, ఇలియాస్ బాష, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, ఆర్ఎస్‌లు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం: ఈవో

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం దేవస్థానం నూతన ఈవోగా వాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ నెల 7 నుంచి 27 తేదీ వరకు 21 రోజులు పాటు జరిగే స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను ఐక్యమత్యంగా కలిసి పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈవోగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆమె బుధవారం ఉదయం ఆలయ సమావేశ మందిరంలో అధికారులకు, అర్చకులు, వేదపండితులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మొదటగా ఆలయ అధికారులను, అర్చక వేదపండితులను సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందరు కలసిమెలసి ఐకమత్యంతో ఆలయంను మరింత అభివృద్ధి చేసుకుంటూ స్వామివారి దర్శనంకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించాలన్నారు. ఆలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఏ సమయంలోనైనా తనిఖీలు చేపడుతామని అలాంటి సమయంలో తప్పులుంటే క్షమించనని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులకు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనకు తెలువవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, ధనుంజయ, సూపరింటెండెంట్లు వాసు, మల్లికార్జున, రంగసామి, అర్చక వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు.


ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వాణి

ఆర్పీలపై రాజకీయ వేధింపులు మానండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఆర్పీలపై రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ అనుబంధ ఆర్పీల సంఘం పట్టణ కార్యదర్శి లక్ష్మి అన్నారు. మెప్మా ఆర్పీలపై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ ఆర్పీల సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటూ పేదల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు తెలిపారు. అయితే ప్రభుత్వం మారగానే గత పాలకులకు అనుకూలంగా పనిచేశారన్న నెపంతో పలువురు ఆర్పీలపై రాజకీయ వేధింపులు మొదలయ్యాయని వాపోయారు. కైలాసగిరి కాలనీలో పనిచేస్తున్న ఓ ఆర్పీని రాజకీయంగా తొలిగించేందుకు కుట్ర పన్నారని వాపోయారు. తమకు ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేదనీ, తమకిచ్చిన బాధ్యతలను సక్రమంగా నెరవేరిస్తే రాజకీయ సంబంధాలు అంటగట్టడం సమంజసం కాదన్నారు. ఇకనైనా ఆర్పిల పొట్ట కొట్టే చర్యలకు ముగింపు పలకాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఆర్పీల సంఘం అధ్యక్షురాలు సరళ దేవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, సంక్రాంతి వెంకటయ్య, వెలివేంద్రం, ఆర్పీలు శాంతి, అమ్ములు, శుభద్ర, హబీబా, లత పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

- ఘనంగా జాతీయ జెండా ర్యాలీలు
- జోరుగా త్రివర్ణ పతాకాల అమ్మకాలు
- దుకాణాల వద్ద సందడి

ప్రజాశక్తి- యంత్రాంగం

78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల కోసం జిల్లాలో పలు దుకాణాల వద్ద చిన్నారులు, పెద్దలు జాతీయ పతాకాలను, బ్యాడ్జీలను కొంటూ రద్దీగా కనిపిస్తున్నాయి. స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఆదేశించడంతో దుకాణాల వద్ద ప్రతి ఒక్కరూ జాతీయ జెండాలను కొనుగోలు చేసి తమ ఇండ్లపై ఎగరవేస్తున్నారు. అంతేకాకుండా చిన్నారులు జాతీయ జెండాల కొనుగోలు చేస్తూ వారికి నచ్చిన జెండాలను ఎంచుకొని వాటిని ధరిస్తున్నారు. దీంతో దుకాణాల వద్ద సందడి నెలకొంది.




కుప్పం టౌన్ : 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సాయిమాత సేవ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం కుప్పం పట్టణంలో 550 అడుగుల జాతీయ పతాకాన్ని ఊరేగింపు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశ సమైక్యతను కాపాడేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డిఎస్పి పార్థసారథి, కమిషనర్ శ్రీనివాసరావు, పిఎస్. మునిరత్నం, సిఐ జిటి.నాయుడు, రాజకుమార్, సత్యేంద్ర, గోపీనాథ్, ఎంఎఫ్‌సి కళాశాల ప్రిన్సిపల్ వాసుదేవ రెడ్డి, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతీశ్వరన్, ఎన్‌సిసి కార్తీక్, మోహన్ పాల్గొన్నారు.





చిత్తూరుఅర్బన్: 78వ స్వాత్యంత్ర దినోత్సవం పురస్కరించుకొని చిత్తూరు నగరంలోని విజయం పాఠశాలలో గురువారం విద్యార్థులు దేశ నాయకుల వేషధారణ ధరించి వారి గొప్పతనాన్ని వివరించారు. అలాగే పిల్లలు కూరగాయలు, పండ్లలతో భారత దేశనమూనాను తయారు చేశారు. విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ శైలజమూర్తి త్రివర్ణ పథకం తయారైన విధానం వాటి ప్రాముఖ్యత గురించి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్వేటినగరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో


సదుం : 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జయ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 3,330 చదరపు అడుగుల భారీ జాతీయ జెండాను పాఠశాల విద్యార్థులు, బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు కలిసి ర్యాలీగా ప్రదర్శించారు. ఎంఈఓ శ్రీరాములు, పూర్వ ఇంచార్జి హెచ్‌ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్ఎంసి ఛైర్మన్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రైవేటు డిగ్రీ కళాశాల విద్యార్థులు, రాజకీయ నాయకులు, ప్రజలు 1500 అడుగుల త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ బస్టాండ్ కూడలి, గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండు కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలవేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్ధన్ నాయుడు, బిజెపి నాయకులు మదన్మోహన్, జనసేన నాయకులు నాగభూషణ్ రాయల్ పాల్గొన్నారు.



వెదురుకుప్పం : మండలంలోని 78వ స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకలలో భాగంగా డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని గురువారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులలో ప్రజలలో జాతీయ స్ఫూర్తిని నింపడానికి ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేష్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఏసీ.భరణీనాథరెడ్డి పాల్గొన్నారు.






విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో జాతీయ జెండాలతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్, పాధ్యాయులు విజయకుమార్, వెంకమరాజు, లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: జాతీయ జెండాని గౌరవించి ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటుకుందామని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయం నుంచి బ్రాహ్మణ వీధి, మండఫం వీధి, బాజర్ విధి మీదుగా పోలీస్ స్టేషన్ వరకు గురువారం విద్యార్థులతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు కలసి హర్ ఘర్ తిరంగాలో భాగంగా 125 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్, సర్పంచ్ ధనంజయవర్మ పాల్గొన్నారు. మండలంలోని డీఎంపురం, ఇందిరా కాలనీలోని పాఠశాలలోనూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.



హర్ ఘర్ తిరంగా తిరంగా ప్రతి పౌరుడిలో దేశ భక్తిని పెంపొందిస్తోందని మండల తహసీల్దార్ భగవతి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో ఆజాది కాఅమృత్ మహెూత్సవంలో భాగంగా విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ భగవతిని శాలువలు కప్పి పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు డాక్టర్ హరిబాబు, ఎస్.కార్తీక్ భార్గవి, వ్యాయామ ఉపాధ్యాయులు జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : విద్యార్థులు చిన్నప్పటి నుంచి దేశ భక్తిని అలవారుచుకోవాలని కుప్పం మండలం చందం పంచాయతీ కొత్తఇండ్లు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్కొండ నాయుడు తెలిపారు. బుధవారం జాతీయ జెండాలతో గ్రామ పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించారు.



తవణంపల్లి : మండలంలోని అరగొండ గ్రామపంచాయతీలో అపోలో గ్రూప్ ఛైర్మన్ పద్మ విభూషణ్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి నెలకొల్పిన అపోలో సంపూర్ణ ఆరోగ్య కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని క్రీడలపోటీలు నిర్వహించారు. అరగొండ మాజీ సర్పంచ్ మాజీ ఎంపీపీ రాజేశ్వరమ్మ ఈ కార్యక్రమానికి హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.



పెద్దపంజాణి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పోస్టల్ శాఖా అధికారులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని వారి స్వగ్రామం కెలవాతిలో బుధవారం మర్యాద పూర్వకంగా కలసి జాతీయ జెండాను బహుకరించారు. చిత్తూరు పోస్ట్ ఆఫీసెస్ సూపరిండెంట్ లక్ష్మణ్ పలమనేరు, రాయల పేట పోస్టల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిలు కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ శేఖావత్ కార్యాలయం నుంచి అందిన త్రివర్ణ పతాకాన్ని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి అందజేశారు.

రామకృష్ణా రెడ్డికి ఘననివాళి



ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రస్తుత రాజకీయ నాయకులకు ప్రజాప్రతినిధులకు ఆదర్శవంతమైన నాయకుడు మా తండ్రి స్వర్గీయ రామకృష్ణారెడ్డి అని పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కెళవాతి స్వగ్రామంలో మాజీ ఎంపీ నూతనకాల్వ రామక్రిష్ణ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ కుటుంబీకులు, టీడీపీ నాయకులు వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ రెడ్డి స్మృతి వనం వద్ద ఆయన తనయుడు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి పూజలు నిర్వహించి ఆయన్ను స్మరించుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలువురు నాయకులు సైతం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర రాజకీయలలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుని ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన ఓటమి ఎరుగని నేత ఆయన అని పలువురు కొనియాడారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు

స్థల పరిశీలన



ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రం సమీపంలోని తిమ్మసముద్రం గ్రామం వద్ద టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు అధికారులు, టిడిపి నేతలు స్థల పరిశీలించారు. సుమారు మూడు ఎకరాలు స్థలాన్ని ఎంపిక చేసి రైతులకు అణువుగా ఉండేవిధంగా చర్యలు చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం ప్రాంతంలో రైతులు అధికంగా ఉన్నారని కూరగాయల పంటలు పండ్ల తోటలు సాగు ఎక్కువగా ఉండడంతో మినీ ఎయిర్ స్ట్రిప్, కోల్డ్ స్టోరేజ్ లు, యూనిట్ క్రాసింగ్ లు, కేంద్ర కృషి ఉద్యానవన కేంద్రాలు తదితర వాటిని ఏర్పాటు చేసి కుప్పం ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రకటించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, కార్యదర్శి ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, చిన్నికృష్ణ, రామ్మూర్తి, రఫీ, జయశంకర్, విశ్వనాథ్, నాగభూషణం, వెంకటాచలం పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని అభ్యుదయ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మండల కరణం సంక్షేమ సంఘ కార్యవర్గ సభ్యులు పాఠశాలకు కుర్చీలు వితరణ చేశారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షులు భాస్కర్ పిల్లై మాట్లాడుతూ సంఘం తరపున వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే పాఠశాలకు కుర్చీలు వితరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరు సహాయం చేసే గుణాలు ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధనంజయరాజు, సంఘ కార్యదర్శి రవీంద్ర ప్రసాద్, కోశాధికారి సుబ్రహ్మణ్య పిల్లా, ఉప కార్యదర్శి హరిహర ప్రసాద్, లోకేష్, శంకరన్ సభ్యులు భాస్కర్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి- విజయపురం: మండల కేంద్రంలో ఈనెల 16 నుంచి 18 వరకు గ్రామీణ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు తప్పక హాజరుకావాలని ఆయన తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

'ఆవర్తన పట్టికతో ప్రజ్ఞాధారణ'

ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి




ప్రజాశక్తి - బంగారుపాళ్యం: ఆవర్తన పట్టికతో ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లహరి, పార్థసారధి రసాయన శాస్త్రంలోని ఆవర్తన పట్టికలోని 118 మూలకాలతో ప్రజ్ఞాధారణ కార్యక్రమం జరిగింది. ఆవర్తన పట్టికలోని 118 మూలకాలను మొదటి నుండి చివరికి పార్థసారథి చెప్పగా లహరి వాటిని చివరి నుండి మొదటికి తెలియజేసినది. టేకుమంద భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు షంషీర్ ఖాన్ ఆవర్తన పట్టికను ప్రదర్శించి విద్యార్థుల ధారణను పరీక్షించారు. ఆవర్తన పట్టికలోని యాదృచ్ఛిక మూలకాలను, మూలకాల పరమాణు సంఖ్య 18 గ్రూపులలోని మూలకాలను అడగగా విద్యార్థులు ఖచ్చితమైన సమాధానాలు ఇచ్చారని ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి తెలిపారు. ఈకార్యక్రమానికి మెంటారుగా వ్యవహరించిన గణిత అవధాని ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఉపాధ్యక్షులు అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ ధారణ ద్వారా విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞాశాలుగా తీర్చిదిద్దవచ్చు అన్నారు. ఉపాధ్యాయులు సంజీవి, ప్రేమకృష్ణ, రమాదేవి, పిళ్లారప్ప, సంపంగి, ధనశేఖర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా చంద్రమౌళి

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం ఎంపీడీవోగా చంద్రమౌళి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టన్నున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు గ్రామసమస్యలపై తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు.

'సామాజిక సమస్యల పరిష్కారాల వేదిక'



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం ఇన్స్పైర్ గైడ్ టీచర్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తయారుచేసి దేశ, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజుల మాట్లాడుతూ మన జిల్లాలో ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత, అన్ని మేనేజ్మెంట్లను పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈసంవత్సరం ఇన్స్పైర్ నామినేషన్స్ తప్పనిసరిగా నిర్ణీత సమయంలోగా చేయాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మన జిల్లాకు వస్తున్న మంచిపేరును కొనసాగించాలని కోరారు. ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇన్స్పైర్ నామినేషన్లు చేయాలని అలాగే ప్రతి మేనేజ్మెంట్‌కు చెందిన ఉన్నత పాఠశాల తప్పనిసరిగా ఐదు నామినేషన్లు చేయాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి రమణ మాట్లాడుతూ విద్యార్థుల మదిలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం, సమాజానికి మేలు చేసే ఆలోచనలకు రూపమివ్వడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందనీ ఇది ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుందని, ఆవిష్కరణ వైపు వారిని నడిపిస్తుందన్నారు. శిక్షణా కార్యక్రమానికి చిత్తూరు, యాదమరి, గుడిపాల, ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, సదుం, సోమల, రొంపిచర్ల, పులిచర్ల జిడి నెల్లూరు, ఎస్ఆర్ పురం, తవనంపల్లి మండలాల నుండి సుమారు అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలలు, రెసిడెన్షియల్, కస్తురిబా, మున్సిపల్, మోడల్ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్, ఎయిడెడ్, ప్రైవేట్) గైడ్ ఉపాధ్యాయులు 200 మంది పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఎమ్మెల్యే' వాయిదా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్వాతంత్రం దినోత్సవ కార్యక్రమాల నిర్వహణ దృష్ట్యా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో ఈ గురువారం జరగాల్సిన 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమం వచ్చే గురువారం జరుగుతుందని కమిషనర్ డాక్టర్ జె అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవిషయాన్ని చిత్తూరు నియోజకవర్గ ప్రజలు గమనించాలని కోరారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పేటూరు, ఇరికిపెంట పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ముమ్మరంగా దోమల నివారణ మందు పిచికారి, బ్లీచింగ్ పౌడర్ చల్లడంతోపాటు పారిశుధ్య పనులు నిర్వహించారు. ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామాలలో పారిశుధ్య కార్మికుల ద్వారా మిలాథిన్ ద్రావణాన్ని పిచికారి చేయించడం, బ్లీచింగ్ పౌడర్ కాలువల వెంట చల్లారు. ఫాగింగ్ మిషన్ ద్వారా మిలాథిన్ ద్రావణాన్ని పొగ రూపంలో దోమల నివారణ కోసం స్ప్రే చేశారు. పంచాయితీ కార్యదర్శులు లలిత కుమారి, మేనక పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం



ప్రజాశక్తి- విజయపురం: తహసీల్దార్ కిరణ్‌ను బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో మండల టీడీపీ నాయకులు మర్యాదపూరకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మండలంలోని రెవెన్యూ సమస్యలపై చర్చించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ రాజు, నాయకులు మునిభాస్కర్ రాజు, పరందామ నాయుడు, ఏలుమలై, కొల్లాపూరి మధు, వరదరాజులు, హరి పాల్గొన్నారు.

మాంసం విక్రయం నిషేధం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలో స్వాతంత్ర దినోత్సవం రోజు మాంసం విక్రయం నిషేదిస్తున్నట్టు పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు నోటీసు ద్వారా తెలియజేశారు. రాష్ట్ర మునిసిపల్ చట్టం 1965 ప్రకారం స్వాతంత్ర దినోత్సవం రోజున మాసం, మాంసాహారం విక్రయించడం నేరమన్నారు. కావున పట్టణ పరిధిలోని చికెన్, మటన్, చేపల దుకాణాలు వంటివి స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం దుకాణాలు మూసివేయాలన్నారు. అలాగే మాంసాహారాలు విక్రయించే హోటల్స్, డాబాలు సైతం నేడు మాంసాహారాలు విక్రాయించరాదనీ తెలిపారు.

'సమస్యలుంటే నేరుగా కలవండి'

తహశీల్దార్ రమేష్ బాబు



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే నేరుగా కలవాలని తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు. మండలంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. న్యాయపరమైన సమస్యలు అయితే కచ్చితంగా పరిష్కారం చేస్తామని అన్నారు. న్యాయపరమైన సమస్యలకు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.

17న శెట్టిపల్లి చేపల చెరువు వేలం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లి చేపల చెరువుకు ఈ నెల 17వ తేదీ శనివారం వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లి చేపల చెరువు, చక్రాల బండ గుంటకు 17వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నమని తెలిపారు. బహిరంగ వేలం నందు పాల్గొన్నవారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, జిఎస్టి రిజిస్ట్రేషన్ పత్రములు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోల తో పాటు, పది లక్షల రూపాయలకు సాల్వేన్సీ సర్టిఫికెట్ లేదా బ్యాంకు గ్యారంటీ, పది లక్షల రూపాయలు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలం నందు పాల్గొనవచ్చునని తెలిపారు.

నూతన డిఎస్పీకి అంబేద్కర్ చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట నూతన డిఎస్పి వెంకటాద్రిని బుధవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన డిఎస్పిని శాలువాతో సన్మానించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా రేణిగుంట మండలంలో ఆషా స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి డిఎస్పీకి వివరించారు. తమ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని డిఎస్పి తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు : ఎస్పీ



ప్రజాశక్తి- వి కోట: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకున్నప్పుడు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. మండల కేంద్రమైన వీకోటలో నూతనంగా నిర్మించిన శ్రీ విద్యానికేతన్ ఇంటర్, డిగ్రీ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ దామోదర్ రెడ్డి వారికి సాధారంగా స్వాగతం పలికారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిందని సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండి మీ భావి భారత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి ఏకాగ్రతతో చదివినప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోగలుగుతారని తెలిపారు. కళాశాల దశలో విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. మారుమూల ప్రాంతమైన వి కోటలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను తక్కువ ఫీజులతో అందించడం తమకు గర్వకారంగా ఉందని కళాశాల చైర్మన్ దామోదర్ రెడ్డి తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత చదువులు చదువు లేని విద్యార్థుల కోసం విద్యాలయాన్ని స్థాపించేందుకు తోడ్పాటును అందించిన ప్రతిఒక్కరికి వారు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల జన్మదిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు తోడ్పాటునందించిన కళాశాల యాజమాన్యానికి ద్రావిడ విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపకులపతి కంకణాల రత్నయ్య అభినందనలు తెలియజేశారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

'మౌళిక వసతుల కల్పనకు సమిష్టిగా పనిచేయాలి'

ప్రజాశక్తి- కార్వేటినగరం: గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషిచేయాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ భవనంలో నిర్వహించిన రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంపీపీ లతబాలాజీ విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సర్పంచ్, కార్యదర్శుల మీదే ఆధారపడి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో సమిష్టిగా కలిసి పని చేసినప్పుడే గ్రామాలు ఆదర్శంగా తీర్చిదిద్దబడుతుందని చెప్పారు. అనంతరం ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి మాట్లాడుతూ గ్రామాల ఆధునీకరణకు ప్రభుత్వం అందించిన శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని అమలు చేస్తూ నూతన ప్రణాళికలను రూపొందించుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఎస్‌డబ్ల్యూటిసిలకు వ్యర్థాలను ప్రతిరోజు తొలగించి వాటి ద్వారా ఎరువులు తయారు చేసి రైతులకు తక్కువ ధరకు అందించాలన్నారు. వీటి వల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవో పీఎస్ మణి. సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపీపీ లతబాలాజీ

డిగ్రీ ఫలితాల్లో ఐఆర్ఎం విద్యార్థుల విజయఢంకా



ప్రజాశక్తి- కుప్పం టౌన్: పట్టణంలోని ఐఆర్ఎం కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు విజయఢంకా మోగించినట్టు కళాశాల అధ్యక్షులు బిఎం.దయానిధి తెలిపారు. ఎస్‌వి విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం ఫలితాల ప్రకారం తమ కళాశాలలో బీకామ్ (సిఎ) విభాగంలో పునీత్ 9.45 పాయింట్లు, బిబిఏలో స్నేహ 9.15 పాయింట్లు, బీఎస్సీ (ఎంపిసిఎస్)లో లావణ్య 9.2 పాయింట్లు, బీఎస్సీ (బిజెడ్‌సి)లో అర్చనా 9.2 పాయింట్లు సాధించి కళాశాలకు మంచిపేరు తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈసందర్భంగా పరీక్షలలో విజయం సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు.

మురుగునీటి కాలువలు కట్టించండి..

జాతీయ రహదారిపై గ్రామస్తుల ధర్నా



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మురుగునీటి కాలువ నిర్మించి మా ఆరోగ్యాలను కాపాడాలని గ్రామస్తులు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. బుధవారం బంగారుపాళ్యం మండలం తగువారిపల్లి పంచాయతీ గ్రామంలో కాలువలు లేక జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో గ్రామస్తులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులు మాట్లాడుతూ మురుగునీరు ప్రవహించేందుకు సరైన కాలువలు లేక మురుగు మొత్తం రహదారిపై కుంటలాగా ఏర్పడి నల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. దీని వలన గ్రామంలో చాలా మంది అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు అంతేకాకుండా నీరు నిల్వ చేరి రహదారిపై కోతులు ఏర్పడుతున్నదని పంచాయతీ అధికారులు రోడ్డు రవాణా సంస్థ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ గోతిలో పడి పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీటి కాలువ నిర్మించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

నిరాశ్రయులకు ప్రత్యేక వైద్యశిబిరాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నిరాశ్రయుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నట్లు సపోర్ట్ సంస్థ అధ్యక్షులు నిరాశ్రయుల వసతి గృహ నిర్వాహకులు జోసఫ్‌రాజ్ తెలిపారు. బుధవారం నగరంలోని మెప్మా, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా నిరాశ్రయులకు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరాన్ని అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ టెలిఫోన్ కాలనీ చిత్తూరు వారి సహకారంతో నిర్వహించటం జరిగింది. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ ప్రశాంతి, సూపర్వైజర్ పవనమ్మ, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్ రాధ పాల్గొని నిరాశ్రయులకు వైద్యచికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోసెఫ్ రాజ్ మాట్లాడుతూ వైద్య శిబిరం నిర్వహించేందుకు అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ డాక్టర్లు సిబ్బంది రావడం చాలా అభినందనీయమని వారి సేవలను కొనియాడారు. డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరాశ్రయులకు మెరుగైన ప్రత్యేకమైన వైద్య పరీక్షలు నిర్వహించి వాళ్ళని ఆరోగ్యవంతులుగా చేయడానికి ఈ వైద్య శిబిరం నిర్వహించటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. వసతి గృహ సిబ్బంది ప్రమీల శశిరేఖ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న స్కూల్ బస్సు

వ్యక్తి మృతి



ప్రజాశక్తి- శాంతిపురం శెట్టేపల్లి అనికెర మలుపు వద్ద కర్ణాటక రాష్ట్రం క్యాసంబళ్ళ చెందిన ఒక ప్రైవేట్ స్కూల్స్ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొంది, ఈ ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే ఒకరు మరణించగా ప్రాణపాయస్థితిలో మరొకరిని పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. స్థానికులు కథనం మేరకు బెండనకుప్పానికి చెందిన నారాయణస్వామి ఢిల్లీలోని ఏపీ భవన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగే తన కుమార్తె నిశ్చితార్థం కొరకు కావలసిన సామాగ్రిని భార్య విజయలక్ష్మితో కలిసి తీసుకొని శాంతిపురం నుండి తిరుగు ప్రయాణం అవ్వగా శెట్టిపల్లి మరియు అనికేర మలుపు వద్ద స్కూలు బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొందని తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న రాళ్ళబూదుగురు ఎస్సై నరేష్ జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి



ప్రజాశక్తి- విజయపురం: పాము కాటుకు ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లసముద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ జయప్ప తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎల్లసముద్రంలో మురుగన్ (48) బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి పొలాల వైపు వెళు తుండగా పాము కాటుకు గురై ఇంటికి చేరుకున్నాడని తెలిపారు. కొంత సమయానికి తలనొప్పిగా ఉందని చెప్పడంతో ఆసుపత్రికి తరలించిగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయప్ప కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి

కిందపడి వ్యక్తి మృతి



ప్రజాశక్తి- సోమల: పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని చల్లా వారిపల్లి వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద సోమల నుండి తిరుపతికి ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పి క్రిందపడి వాహన చోదకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో జరిగింది. కల్లూరు సీఐ సూర్యనారాయణ వివరాల మేరకు మండల కేంద్రమైన సోమల సంత గేటు వీధికి చెందిన గోపి కుమారుడు వెంకటేష్ (33) సోమల నుండి తిరుపతికి స్కూటీపై బయలుదేరి చల్లావారిపల్లి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద స్కూటర్ను అదుపు చేయలేక క్రిందపడి తలకు తీవ్రగాయం కావడంతో అధిక రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్‌కు నిప్పు పెట్టిన ఆకతాయిలు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి మండలంలోని పెద్దచెరువు సమీపంలోని శేషగౌడ ఇటుకల బట్టిలో ఇటుకలు కాల్చేందుకు నిల్వ ఉంచిన బొగ్గు పక్కనే ఉన్న ట్రాక్టర్‌కు గుర్తు తెలీని ఆకతాయిలు మంగళవారం రాత్రి నిప్పు అంటించారు. దీంతో బొగ్గుతోపాటు ట్రాక్టర్ మంటల్లో కాలిపోయింది. దీంతో ఇటుకల బట్టీ యజమాని శేషగౌడ పోలీసులకు పిర్యాదు చేశారు. ఆకతాయిల పని వలన తనకు లక్షల్లో నష్టం వచ్చిందని శేషగౌడ వాపోయారు.

ప్రతి నెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

చెల్లం ఆనంద్ ప్రకాష్

ప్రజాశక్తి -తిరుపతిటౌన్ సివిల్ రైట్స్ చట్టం సక్రమంగా అమలయ్యేలా మండల స్థాయిలో ప్రతి నెలాఖరు రోజున తప్పక జరపాలని, పోలీస్ యంత్రాంగం, సంబంధిత అధికారులు పాల్గొనాలని ఆం.ప్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద ప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్సీ కమిషన్ సభ్యులు తిరుపతి డివిజన్ తహశీల్దార్లు, పోలీస్ అధికారులతో సివిల్ రైట్స్ డే పై సమీక్షిస్తూ ప్రతి నెలా ఆఖరు రోజున సివిల్ రైట్స్ డే తప్పక నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ లపై అట్రాసిటీ లు జరగకుండా వారికి భద్రత మన రాజ్యాంగం నుండి కల్పించబడిందని, అసమానతలు ఉండరాదని అన్నారు. ఎస్సీ లపై ఎలాంటి దౌర్జన్యాలు జరగరాదని, అలాంటివి రిపోర్ట్ అయినప్పుడు నిబంధనల మేరకు తప్పక చర్యలు పోలీస్, రెవెన్యూ తదితర సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. 67 లక్షల రూపాయలు పెండింగ్ కంపెన్సేశన్ ఉన్నవాటిని త్వరితగతిన క్లియర్ చేయాలని, నిధుల కొరత ఉంటే ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కొన్ని చోట్ల బాగా సివిల్ రైట్స్ డే జరుగుతున్నాయని, మరికొన్ని చోట్ల ఇంకా సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ నిషాంత్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.